## 307 వ అధ్యాయం

## ٣٠٧ - بَابُ كَرَاهِيَةِ تَعْلِيقِ الْجَرَسِ فِي الْبَعِيرِ وَغَيْرِهِ مِنَ الدَّوَابِّ وَكَرَاهِيَةِ اسْتِصْحَابِ الْكَلْبِ وَالْجَرَسِ فِي السَّفَرِ

## ఒంటె తదితర జంతువుల మెడలకు గంటలు కట్టటం, ప్రయాణంలో కుక్కల్ని, గంటల్ని తోడు ఉంచుకోవటం అవాంఛనీయం

١٦٩٢ - عَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «لا تَصْحَبُ الْمَلائِكَةُ رُفْقَةً فيهَا كَلْبٌ أَوْ جَرَسٌ» رواه مسلم.

1692. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: కుక్కలు లేక గంటలతో ఉన్న ప్రయాణ బృందాల వెంట దైవదూతలు ఉండరు.

(ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని లిబాస్, జీనత్ ప్రకరణం)*

**ముఖ్యాంశాలు:**

వేట కుక్కలకు, ఇంకా పొలాల పశువుల రక్షణ కోసం ఉపయోగించే కుక్కలకు ఈ ఆజ్ఞ వర్తించదు. వీటిని తప్ప ఇతర కుక్కల్ని ప్రయాణంలో వెంట ఉంచుకోరాదు. పై హదీసులో కుక్కలంటే ఆ కుక్కలనే భావం. దైవదూతలంటే కారుణ్యం కురిపించే దూతలని భావం. పోతే మనిషి రక్షణ నిమిత్తం నియమించబడిన దైవదూతలు ఎల్లప్పుడూ అతని వెంటే ఉంటారు.

١٦٩٣ - وَعَنْهُ أَنَّ النَّبِيَّ ﷺ قَالَ: «الجَرَسُ مَزَامِيرُ الشَّيْطَانِ» رَوَاهُ مُسْلِمٌ.

1693. హజ్రత్ అబూహురైరా (రజి) గారే చేసిన వేరొక కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: గంటలు (గజ్జెలు మొదలగు నవన్నీ) షైతాన్ బాజాబజంత్రీలు.

(ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని లిబాస్, జీనత్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

'మజామీర్' అనేది 'మిజ్‌మార్'కు బహువచనం. సంగీత వాద్యానికి ఉపయోగించే వస్తువుని 'మిజ్‌మార్' అని అంటారు. డోలు, సన్నాయి, గిటారు, ఢమరుకం, మ్యూజిక్ ఇతర సంగీత వాయిద్యాలన్నీ మిజ్‌మార్ క్రిందికి వస్తాయి. ఇవన్నీ షైతాన్ వాద్యాలు. వీటి ద్వారా షైతాన్ మనుషుల్ని భ్రష్టుపట్టిస్తుంటాడు. ఈ రోజుల్లో ఈ షైతాన్ వాద్యాలు ఎంతగా మితిమీరి పోయాయంటే దానికి ఒక హద్దంటూ లేకపోయింది. అంతేకాదు, మనుషుల సహజత్వం కూడా ఎంతగా కలుషితమై పోయిందంటే వారు సంగీతాన్ని మనసులకు ఆహారంగా తలపోస్తు న్నారు. అవును, షైతాన్‌కు దాసోహమన్న పైశాచిక ఆత్మలకు సంగీతమే ఆహారం అవుతుంది. ఎందుకంటే పెంటలో బతికేవాడికి ఆ పెంట ఎంత కమ్మగా మారిపోతుందంటే అది లేకుండా అతను బతకనయినా బతకలేడు.